క్లుప్తంగా

వెండి కిరీటం సమర్పణ



అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం

రాజానగరం: స్థానిక రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారికి గురువారం వెండి కిరీటాన్ని సమర్పించారు. రాజానగరానికి చెందిన ఆర్ఎస్ రామబ్రహ్మం, ఆర్ఎస్ సత్యనారాయణ రూ.50 వేలతో ప్రత్యేకంగా తయారు చేయించారు. ఆలయ పూజారి ఈ కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పందలపాకలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

బిక్కవోలు: మండలంలోని పందలపాక షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద మాఘ మాసం గురువారం పురస్కరించుకుని బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి బాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నల్లమిల్లి సుబ్బారెడ్డి, వరలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వైభవంగా అంకాలమ్మ జాతర

రాజానగరం: ప్రగడ వంశీయుల కులదేవత అంకాలమ్మ జాతర మహోత్సవాలు మండలంలోని నరేంద్రపురంలో గురువారం వైభవంగా జరిగాయి. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రగడ వంశీయులు ప్రతి రెండేళ్లకోసారి తమ ఇలవేల్పుకు నిర్వహించే జాతర మహోత్సవాలలో పాల్గొనడం ఆనందకరమన్నారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా సత్తిబాబు



రాజానగరం: బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా రాజానగరానికి చెందిన మోది సత్తిబాబు నియమితులయ్యారు. ఆయన ఈనెల 17, 18 తేదీల్లో ఢిల్లీలో జరిగే జాతీయ కార్యవర్గ సమావేశాలలో పాల్గొనేందుకు పయనమయ్యారు. సత్తిబాబు ఇంతవరకూ యువమోర్చా మండల అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, మండల అధ్యక్షుడిగా, అసెంబ్లీ కన్వీనర్‌గా, పార్లమెంట్ కన్వీనర్‌గా, ఎయిర్ పోర్టు అడ్వయిజరీ బోర్డు మెంబర్‌గా వివిధ పదవులు నిర్వర్తించారు. తన ఉన్నతికి కారకులైన పార్టీ నాయకులు సోము వీర్రాజు, రేలంగి శ్రీదేవి, బొమ్ముల దత్తుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

కడియం: వేమగిరి వద్ద ఒక నర్సరీ సమీపంలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.20,100, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్టు ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఎస్ఐ టి.కృష్ణసాయి, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి నుంచి వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని కవలగొయ్యి గ్రామానికి యర్రా దుర్గ గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె భర్త యర్రా శ్రీనివాస్ (42) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడికి మతిస్థిమితం సరిగ్గా లేదు. గత ఏడాది నవంబర్ 25న విజయవాడ వెళ్తున్నానని అని చెప్పి వెళ్లిన శ్రీనివాస్ తిరిగి రాలేదు. ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బంధువులు, స్నేహితులు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలో వెతికారు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలు

రాజమహేంద్రవరం సిటీ: మానవత స్వచ్ఛంద సేవాసంస్థ, కేఎస్ఆర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఎముకల సాంద్రత నిర్ధారణ పరీక్షలకు ప్రజలు విశేషంగా తరలివచ్చారని కేఎస్ఆర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మ ఉజ్వల్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బూరగడ్డ మురళీ, కోశాధికారి పి.కృష్ణ ప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక కంభం సత్రం సమీపంలోని కేఎస్ఆర్ ఆసుపత్రిలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిర్వహించిన ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కొమ్మ సుస్మిత రోగులను పరీక్షించారు. ఆమె మాట్లాడుతూ విటమిన్ డి లోపం వల్ల కలిగే నష్టాలను వివరించారు. మొలకెత్తిన గింజలు, ఆకు కూరలు, పాలు, పండ్లను ఎక్కువగా తీసుకోవాలని, ప్రతి రోజూ కనీసం 15 నిమిషాలు సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలని సూచించారు. సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించారు.

సీతానగరం పీహెచ్‌సీకి మహర్దశ

- సీహెచ్‌సీగా అప్‌గ్రేడేషన్
- ఫలించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి
- రూ 8.కోట్లతో త్వరలోనే శంకుస్థాపన



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఆశయంతో స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేస్తున్న కృషికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం లభించింది. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మారనుంది. దీనికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో రూ. 8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మండలంలోని రఘుదేవపురంలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు త్వరలో శంకుస్థాపన జరగనుంది. ఇప్పటికే క్యాన్సర్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీఎస్ఎల్ సౌజన్యంతో నియోజవర్గంలోని ప్రతి గ్రామంలోనూ వైద్యశిబిరాలు నిర్వహించారు. క్యాన్సర్ బాధితులకు ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించారు.

అందుబాటులోకి మెరుగైన వైద్యం

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేస్తే పలువురు స్పెషలిస్టుల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. 30 పడకల ఆసుపత్రితో 24 గంటలు వైద్య సేవలు సైతం అందుబాటులో ఉంటాయి. సీహెచ్‌సీకి కొత్తగా 23 పోస్టులు మంజూరయ్యాయి. వాటిలో ఒక సివిల్ అసిస్టెంట్ సర్జన్ - స్పెషలిస్టులు జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఓబీజీ, పీడియాట్రిక్స్, అనస్తీషియా, జనరల్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్, హెడ్ నర్స్, ఆరుగురు స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్, గ్రేడ్-1, 2ల ఫార్మసిస్టులు, థియేటర్ అసిస్టెంట్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, పోస్టుమార్టం అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు, ఆరుగురు జనరల్ డ్యూటీ అటెండర్లు, ఆఫీసు సబార్డినేట్ పోస్టులు ఉన్నాయి.



సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

గత పాలకుల నిర్లక్ష్యం

దశాబ్దాల క్రితం నెలకొల్పిన పీహెచ్‌సీ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో మండల ప్రజలకు అరకొరగా వైద్య సేవలు అందేవి. ఒక వైద్యుడు, నామమాత్రపు సిబ్బందితో నెట్టుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో త్వరలో సీహెచ్‌సీకి శంకుస్థాపన జరగనుంది. దాని నిర్మాణం పూర్తయితే మండల ప్రజలు మరింత మెరుగైన వైద్యసేవలు పొందవచ్చు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో సీతానగరం మండలం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోంది.

ఎమ్మెల్యే రాజా కృషితో..



మండలంలో పీహెచ్‌సీ స్థానంలో సీహెచ్‌సీ వస్తుందని కలలో కూడా అనుకోలేదు. పేదలు మెరుగైన వైద్యసేవలకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నెలకొల్పితే ఇక్కడే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగానే 30 పడకల ఆసుపత్రి రానుంది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. - కొండు రమేష్‌బాబు, పురుషోత్తపట్నం

అభివృద్ధి పరుగులు



సీతానగరం మండలానికి నాలుగు లైన్ల రోడ్డు వచ్చింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్పు చెంది, 30 పడకల ఆసుపత్రిగా రానుంది. బొబ్బిల్లంక వద్ద బురద కాలువ నీటిని ఎత్తిపోయడానికి ఎత్తిపోతల పథకం నిర్మాణం జరగనుంది. ఈ పథకం వల్ల సుమారు 25 వేల ఎకరాలు ముంపు బారి నుంచి బయటపడతాయి. సీఎం జగన్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు ధన్యవాదాలు.

- కొంచ అన్నపూర్ణ, సర్పంచ్, వంగలపూడి

అభివృద్ధికి చిరునామాగా రాజానగరం

- నియోజకవర్గంలో ప్రగతి పరుగులు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



ఫరిజల్లిపేటలో ఓహెచ్ఆర్ ప్రారంభించి, తాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: అభివృద్ధి అంటే రాజానగరాన్ని చూడాలనే రీతిలో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు నడిపిస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలో ఫరిజల్లిపేట, కానవరం, తోకాడ, రాజానగరం, పాత వెలుగుబంద, నరేంద్రపురం, నందరాడ తదితర గ్రామాలలో గురువారం ఆయన పర్యటించి, పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తన తండ్రి, దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు హయాంలో జరిగిన అభివృద్ధి మినహా ఆ తరువాత ఎవ్వరూ నియోజకవర్గ ప్రగతిని పట్టించుకోలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాత గడచిన నాలుగున్నరేళ్లలో ఈ నియోజకవర్గంలో రూ.1,158 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడమే కాకుండా మరో రూ.1,146 కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు అందించామన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావుతో కలిసి తాను కూడా పయనించానన్నారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ ప్రగతికి ఆయన చూపే చొరవే రాజాలోనూ కనిపిస్తోందన్నారు. నియోజకవర్గాన్ని ఆయన ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారన్నారు.

ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

ఫరిజల్లిపేటలో రూ.63 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఆర్, కానవరంలో రూ.99 లక్షలతో జలజీవన్ మిషన్ పథకంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్, కానవరంలో గ్రావెల్ రోడ్డు, తోకాడలోని జగనన్న కాలనీలో రూ.78.5 లక్షలతో ఏర్పాటు చేసిన బోరు, పైపులైన్లు, రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, మరో రూ. 20 లక్షల రుడా సహకారంతో ఏర్పాటు చేసిన జిమ్‌ను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. ఫరిజల్లిపేటలో చాగల్నాడు కాలువపై రూ.20 లక్షలతో నిర్మించే వంతెనకు, తోకాడలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.78.54 లక్షలతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకు, మరో రూ.50 లక్షలతో చేపట్టే చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, కో కన్వీనర్ గండి నానిబాబు, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు ఉండమట్ల రాజబాబు, గంగిశెట్టి సోమేశ్వరరావు, అనదాస సాయిరామ్, వేమగిరి కృష్ణ, సంగీత సత్తిబాబు, శ్రీరామకృష్ణ, కోడి రాఘవ, వీర వెంకట్రావు, వెంకటేశ్వరరావు, నీలపాల శివ, సంగీత శ్రీను, దుర్గారావు పాల్గొన్నారు.



రుడా చైర్మన్ రౌతుతో కలిసి జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజా

విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



పందలపాకలో సబ్‌స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో రూ.2.76 కోట్ల ఖర్చుతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పందలపాక, తొస్సిపూడి, కొమరిపాలెం, కొంకుదురు, ఆరికరేవుల తదితర గ్రామాల్లో ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న లోటల్టేజీ సమస్యకు నేటితో పరిష్కారం లభించిందన్నారు. దీర్ఘకాలంగా విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మన ప్రభుత్వ హయాంలో తీర్చడం సంతోషంగా ఉందన్నారు. దీనికి సహకరించిన అధికారులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కర్రి గీతా సావిత్రి, మచ్చాపాప, కొంకుదురు పీవీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, తొండాపు గాంధీ, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గండి వాసు, విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లా సూపరింటెండెంట్ టీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని సాయిరామ తులసికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

పెదపూడి: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్ట్ పోటీలకు సంపర జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని పి.సాయిరామ తులసి ఎంపికైందని హెచ్ఎం ఆర్.త్రిమూర్తులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కాకినాడలోని శ్రీపైడా సత్తిరాజు మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంలో తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు నాలుగు విభిన్నమైన ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారన్నారు. వాటిలో విద్యార్థిని సాయి రామ తులసి తయారు చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ క్లీనింగ్ విత్ రోబోట్ అనే ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై ందని చెప్పారు. విద్యార్థిని సాయి రామతులసిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎరుబండి శ్రీరామచంద్రమూర్తి, మట్టా రామ అయ్యన్న, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ సలాది విమల, ఉపాధ్యాయులు అభినందించారు.

కంప్యూటర్ డిజిటల్ మేళా



పందలపాకలో ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో గొలుగూరి నాగిరెడ్డి తదితరులు

బిక్కవోలు: మండలంలోని పందలపాక శ్రీపడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రథమ ఇన్ఫోటెక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ డిజిటల్ మేళా కార్యక్రమాన్ని పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు గొలుగూరి నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డిలు ప్రారంభించారు. అనంతరం వారి ద్దరూ పాఠశాల విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులకు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలోని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, పాఠశాల కంప్యూటర్ ఉపాధ్యాయులు డి.సత్యనాగదేవి, కె.బిందుమాధవి, పీడీ దార్వంపూడి యువరాజారెడ్డి, కర్రి సతీష్ తదితరులు పాల్గొన్నారు. తొస్సిపూడి ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన కంప్యూటర్ డిజిటల్ మేళాలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం లచ్చిరెడ్డి సత్యనారాయణ, ప్రథమ ఇన్ఫోటెక్ రాష్ట్ర ప్రతినిధి జి.లోకరాజు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం



నరేంద్రపురం జగనన్న కాలనీలో గృహ ప్రవేశం చేయిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని తోకాడ, నరేంద్రపురం జగనన్న కాలనీలలో గురువారం జరిగిన గృహ ప్రవేశాలకు హాజరైన ఎమ్మెల్యే కొద్దిసేపు లబ్ధిదారులతో మాట్లాడారు. నిలువ నీడ లేక అవస్థలు పడుతున్న పేదల గురించి తన సుదీర్ఘ పాదయాత్ర ద్వారా స్వయంగా తెలుసుకున్న జగనన్న, అధికారంలోకి రాగానే పేదోడి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలో ఒకేసారి 31 లక్షల మందికి నివాస స్థలాలను అందించారన్నారు. ఆయా స్థలాలలో పక్కా గృహాలు కట్టుకునేలా ఆర్థిక సాయాన్ని అందిస్తూ, కొత్త గ్రామాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. అటువంటి నేతను ఏనాడు మరువరాదని, రాబోయే ఎన్నికలలో ఆయనకు ఓటు వేయడం తమ కర్తవ్యంగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మధురపూడి: బూరుగుపూడి సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు. బూరుగుపూడి, గుమ్ములూరు, బుచ్చెంపేట, దోసకాయలపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో వైద్య సిబ్బంది

రంగంపేట: మండలంలోని అన్ని గ్రామాలను క్షయ రహితంగా తీర్చిదిద్దాలని పీహెచ్‌సీ వైద్యాధికారి వేణు శ్రీలక్ష్మి సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా గురువారం జి.దొంతమూరులో క్షయ రోగులను పరిశీలించి ఏమేం మందులు వాడుతున్నారో అడిగి తెలుసుకున్నారు. శిక్షణ, పోషణ, యోజన పథకంలో రూ.3 వేలు అందినట్లు రోగులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోలి రమణ, డాక్టర్ డి.దుర్గాప్రసాద్, పంచాయితీ కార్యదర్శి బి.గౌరీ శాంతి, ఎన్టీఎస్ బి.మహేష్, ఎస్టీఎల్ఎస్ జి.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీలు బి.లలిత, శిరీష పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవీ గౌరీ శంకరుల రథోత్సవం

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో గురువారం శ్రీదేవీ గౌరీ శంకరుల రథోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చెరువు గట్టుపై కొలువుదీరిన గౌరీ శంకరుల ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీ సమేతంగా తరలివచ్చి, గౌరీదేవికి చీర, సారె సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ నూతనంగా తయారు చేసిన రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ రథోత్సవంలో వేలమంది మహిళలు పాల్గొన్నారు. సారెతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చెరువు గట్టు నుంచి బయలుదేరి రామాలయం, బీసీ కాలనీ, పాత వీధి, పందుళ్లమ్మ గుడి, బస్టాండ్ సెంటర్, మోదకొండమ్మ సెంటర్ మీదుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ముక్కువారి చెరువులో నిమజ్జనం నిర్వహించారు. కార్యక్రమంలో కేఆర్‌జే రాజేష్, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు అభినందనలు

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండలో పలు అభివృద్ధి పనుల నిర్వహణ కోసం రూ.80 లక్షలు అందించిన ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు ఆ గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ప్రకటన విడుదల చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు తెలిపిన సమస్యలను వీటితో పరిష్కరిస్తామన్నారు. పంచాయతీలోని 14 వార్డుల్లో వాటర్ ట్యాంకులు, సీసీ డ్రైనేజీలు, రోడ్లు నిర్మించడానికి కార్యాచరణ రూపొందించామని, ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి రమేష్ సమావేశం నిర్వహించారన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి



ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న పీడీ ముఖలింగం

సీతానగరం: మండలంలో జరిగే ఉపాధి హామీ పథకం పనులకు కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ ఎ.ముఖలింగం సూచించారు. ఏపీడీ బి.రామ్‌ప్రసాద్, ఏపీవో కె.నాగ శేషవేణితో కలిసి గురువారం ముగ్గళ్లలో జరుగుతున్న పంటబోదె పూడికతీత పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి ఎంత కూలి వస్తోందని అడిగి తెలుసుకున్నారు. రూ.272 వచ్చేలా పనులు చేయాలని, ప్రతి కుటుంబం వంద రోజులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీవో నాగ శేషవేణి మాట్లాడుతూ మండలంలో జరిగే ఉపాధి పనులకు 400 మంది కూలీలు వస్తున్నారని తెలిపారు. పీడీ మాట్లాడుతూ వెయ్యి మంది కూలీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాలు 300 వరకు ఉన్నాయని, వచ్చే నెలాఖరుకు వాటి సంఖ్యను 1,500 వరకూ పెంచాలన్నారు. 2024 - 25కు పనులు గుర్తించి ఆమోదం పొందాలన్నారు. కార్యక్రమంలో జేఈ ఇన్‌చార్జి అంజనీ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ చక్రవర్తి, పీవోలు మోహిద్దీన్, రమణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి చందన యాత్ర మహోత్సవాలు



ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ ధర్మకర్తలు

సీటీఆర్ఐ: స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ వరహాలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మధుభయ వేదాన్తాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన శుక్రవారం నుంచి ఈనెల 21 వరకూ 22వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలు నిర్వహించడానికి ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్చకులు అవసరాల శ్రీకిరణ్ స్వామి వివరాలు వెల్లడించారు. ఆ ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఉత్సవ ప్రార్థన, విష్వక్సేన పూజ, ఋత్విక్ వరుణం, రక్షా సూత్రం, అంకురారోపణ, వైనతేయ ప్రతిష్ఠ జరుగుతాయి. శనివారం ఉదయం సంతాన సాఫల్యం కోసం గరుడ ప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటలకు తిరువీధి (గరుడ సేవ) ఉత్సవం ఉంటుంది. ఆదివారం ఉదయం ఆరాధన, హోమాలు, సాయంత్రం ఎదురు సన్నాహం, తిరుకల్యాణ మహోత్సవం, మూర్తి కలశారాధన నిర్వహిస్తారన్నారు. 19వ తేదీ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ నిజరూప దర్శన సేవ, రాత్రి 8 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, 9 గంటలకు చందన సమర్పణ, తీర్థగోష్టి నిర్వహిస్తారు. 20న ఆరాధన హోమాలు, చందన రూపంతో నిత్యరూప దర్శనం, సాయంత్రం 5 గంటలకు శ్రీవారి చక్రస్నానం, చోరోత్సవం నిర్వహిస్తారు. 21 ఉదయం 10 గంటల నుంచి శ్రీవారి ప్రసాదం, అన్నసమారాధన, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, ద్వాదశారాధనలు, మహాపూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి.